విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడండి

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర -భీమవరం: సాగునీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, సాగునీటికి ఇబ్బంది లేకుండ పగడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని శివారు ప్రాంతాల్లో రబీ పంట సాగుకు సాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సాగునీరు విడుదల తగినంతగా ఉన్నా కొన్ని ప్రాంతాల్లో ప్రవాహానికి కర్రనాచు అడ్డుగా ఉండటంతో నీటిపారుదల తగ్గుతుందన్నారు. ఇటువంటి ప్రాంతాలను గుర్తించి కర్ర నాచు తొలగింపునకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత ఖరీఫ్ సీజన్లో 68,796 మంది రైతులకు ధాన్యం కొనుగోలు నిమిత్తం రూ.926.67 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 66,991 మంది రైతులకు రూ.910.43 కోట్లు చెల్లించడం జరిగిందని, ఇంకా 1,305 నంది రైతులకు రూ.16.24 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. తొలుత మండలాలు వారీగా వ్యవసాయ అధికారులతో ఆయా ప్రాంతాల సాగునీటిపై సమీక్షించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇంకా చెల్లించవలసిన మొత్తాన్ని వెంటనే రైతుల ఖాతాలకు జమ అయ్యేలా చూడాలన్నారు. పశు సంరక్షణకు రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయాలని, సబ్సిడీపై దానా అందజేయుటకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు, నీటిపారుదలశాఖ ఈఈ యం.దక్షిణామూర్తి, సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాదు, జిల్లా సివిల్ సప్లై అధికారి యన్.సరోజ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీ కృష్ణ, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మిచౌంగ్ తుపాను పరిహారం మంజూరు

- ఏలూరు జిల్లాకు రూ. 20 కోట్లకుపైగా పరిహారం

విశాలాంధ్ర - లింగపాలెం : ఏలూరు జిల్లా మిచౌంగ్ తుఫాను వలల నష్టపోయిన పంటలకు పరిహారం మంజూరైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న, పొగాకు పంటలకు సంబంధించి దాదాపు 13 వేల 177 హెక్టార్లలో పంటలు నష్టపోయాయని గుర్తించారు. 24 వేల 679 మంది రైతులకు నష్టం వాటిల్లింది. పరిహారంగా 20 కోట్ల 19 లక్షల 39 వేల 748 రూపాయలు మంజూరయ్యాయి. చింతలపూడి నియోజకవర్గంలోని లింగపాలెం మండలంలో 750 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లి 1681 మంది రైతులు నష్టపోగా, వీరికి ఒక కోటి 12 లక్షల 65 వేల 122 రూపాయలు మంజూరయ్యాయి. చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల్లో 1130 హెక్టార్లలో పంటలు నష్టపోయాయి. 2 వేల 94 మంది రైతులకు నష్టం వాటిల్లింది. ఈ మూడు మండలాల్లోని రైతులకు ఒక కోటి 59 లక్షల 11 వేల 365 రూపాయలు పరిహారంగా మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

సమన్వయంతో బలివే తిరునాళ్ల

విశాలాంధ్ర -ముసునూరు: తిరునాళ్ల నాలుగు రోజుల్లో పారిశుధ్యపనుల్లో ఎలాంటి తేడా వచ్చినా సహించేది లేదని పంచాయతీ కార్యదర్శి పై నూజివీడు ఆర్డిఓ వై.భవానీ శంకరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలం లోని బలివే గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం ఈ నెల 7,8,9,10వ తేదిలలో జరుగు

కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో భవానీ శంకరీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండు,మూడు సంవత్సరాలతో పోల్చుకుంటే ఈ ఏడాది కళ్యాణ తిరునాళ్ళ ఉత్సాహం సందర్భంగా సుమారు రెండు లక్షల మంది భక్తులు హాజరై అవకాశం వుందన్నారు. ఆర్అండ్‌బి డిఇ తో మాట్లాడుతూ నూజివీడు నుండి వేల్పుచర్ల వరకు సుమారు 22 కిలో మీటర్లు మొత్తం గోతులమయంగా వుందన్నారు. నూజివీడు డిఎస్పీ జి.లక్ష్మయ్యతో మాట్లాడుతూ ట్రాఫిక్ ,శాంతి భద్రతలు, దొంగతనాలు లేకుండా సీసీ కెమెరాల కనుసన్నుల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. ఆర్టీసీ వారు ఏలూరు డిపోనుండి 55బస్సులు,నూజివీడు డిపో నుండి 25 బస్సులు నడపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావు ప్రవీణా సుధాకర్,డిఎస్పీ జి.లక్ష్మయ్య, నూజివీడు సిఐ రామ కృష్ణ,ఎస్ఐ పి.వాసు, తహశీల్దార్ జవహర్ బాజీ,ఎంపిడిఓ చాగంటి పద్మావతిదేవి, వైద్యశాఖాధికారులు, రెవిన్యూ, ఎంపిడిఓ, పోలీస్‌శాఖ, దేవదాయ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 9న జరగవలసిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్చబడిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ దావా కేసులను 16వ తేదీన హాజరై పరిష్కరించు కోవాల్సిందిగా తెలియజేశారు. ప్రతిరోజు పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో రాజీ యోగ్యమైన కేసులలో ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం నిర్వహించి రాజీ చేయడం జరుగుతుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించవలసిందిగా తెలిపారు.

నరసాపురం పురపాలక సంఘము

నరసాపురం పురపాలక సంఘము నందు 15 వ ఆర్థిక సంఘం నిధులు, ప్లాను గ్రాంటు & మునిసిపల్ సాధారణ నిధులతో వివిధ పనులు చేపట్టుటకు

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.356/2022-ఇ1, 467/2022 & 316/2023-ఇ1, మరియు ఇ-2, తేది:05-03-2024

1. బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం	: 06-03-2024 ఉ.గం.11.30లకు
2. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం	: 12-03-2024 సా.గం.4.00లకు
3. ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం	: 12-03-2024 సా.గం.4.30లకు

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.232/1/2020-ఇ1, మరియు ఇ-2, తేది :05-03-2024

1. బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం	: 06-03-2024 ఉ.గం.11.30లకు
2. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం	: 12-03-2024 సా॥గం.4.00లకు
3. టెక్నికల్ బిడ్ తెరచు తేది మరియు సమయం	: 12-03-2024 సా॥గం.5.30లకు
4. ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం	: 13-03-2024 ఉ॥గం.11.00లకు

తదుపరి వివరాలను www.eprocurement.gov.in లోని 'ఇప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.
నరసాపురం పురపాలక సంఘం, ఫోన్ : 08814- 273332

కమీషనరు
నరసాపురం మునిసిపాలిటీ

అందరికీ పరీక్షా కాలం

- రాజకీయ నాయకులు, అధికారుల్లో ఆందోళన
- ప్రక్రియ నిలిచే వరకు పోలీసులకు ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఇది నిజంగా పరీక్షా కాలం.. విద్యార్థులకే కాదు.. రాజకీయ నాయకులకు కూడా పరీక్షా కాలమే. ఈనెల 1 నుంచి ఇంటర్, 18నుంచి ఎస్ ఎస్ సి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరో కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయకుల్లో ఆందోళన, ఒత్తిడి ఉంటుంది. సాధారణంగా రాజకీయ నాయకులకు తప్ప అందరికీ ఏదో ఒక పరీక్ష ఉంటుంది. కానీప్రస్తుతం జరగబోయే ఎన్నికల పరీక్షల్లో మాత్రం అసలైన విద్యార్థులు రాజకీయ నాయకులే. ఈ పరీక్షలలో అసలైన విద్యార్థులు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులే. ఇంటింటా ప్రచారాలు, ఎన్నికల హామీలు ప్రకటిస్తున్నారు. గట్టెక్కుతామనే నమ్మకం అందరిలోనూ ఉంది. కాని వీరి తలరాతలు మార్చే ఓటరు మహాశయులు తమకు మార్కులు ఎలా వేస్తారోనని అనుమానం మాత్రం తొలిచేస్తుంది. మామూలుగా విద్యార్థులైతే బాగా చదివితే అందరూ ఉత్తీర్ణులవుతారు. ఎన్నికల పరీక్షలలో మాత్రం ఒక్కరే నెగ్గుతారు. మార్కులు రాకుంటే సప్లమెంటరీ, లేదా ఏడాది తర్వాత మళ్లీ పరీక్షలు రాయొచ్చు. కానీ రాజకీయ నాయకులకు మాత్రం మళ్లీ ఐదేళ్ల వరకు పరీక్షలు ఉండవు. అందుకే ఎలాగైనా ఒడ్డుకు చేరేందుకు రాత్రనక, పగలనక కష్టపడుతూ మమ్మల్ని ఎలాగైనా గట్టెక్కించాలంటూ వేడుకుంటున్నారు.

ఉపాధ్యాయులకు ఉత్కంఠ

ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి శిక్షణ ఇచ్చినా పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు ఉంటాయోనని పోలింగ్ సిబ్బందికి ఒకటే బెంగ. ఎందుకంటే ఇక్కడ పరీక్షలు దిద్దేది ఒక్కరే కాదాయే. ఎందరో రకరకాల వాళ్ళు వస్తుంటారు. వచ్చిన వాళ్లందరితో ఓటు అనే పరీక్ష పేపరు దిద్దించాల్సిన బాధ్యత వీరిదే కదా.ఈవీఎం తిరిగి అధికారులకు అందజేసే వరకు మనసులో మనసు ఉండదు.

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసులకు ఆందోళనే

ఈ ఎన్నికలలో పోలీసు పాత్ర కీలకం. ఎన్నికలు ముగిసే వరకు వారికి టెన్షన్. ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తూ ఎలాంటి సంఘటనలు జరగకుండా శ్రమిస్తున్నా సజావుగా జరుగుతాయా... లేదా.... అని ఆందోళన. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో పరిస్థితులు ఆందోళన కలిగిస్తుంటాయి. రాజకీయ నాయకులు ఏమి చేస్తారో... ఏమో... అని ఒకటే భయం. ఎలాగైనా విజయం సాధించేందుకు ఎంతకు తెగిస్తారో అని వీరికి కంటిపై కునుకు లేకుండా చేస్తోంది.

అనుచరులకు ఆత్రుతే

ఇన్ని రోజులు రాజకీయ నాయకులు, కార్యకర్తలు కలిసి తిరిగారు. సభలు, సమావేశాలలో పాల్గొన్నారు. కానీ ఎన్నికలలో సహచరుడు గట్టెకు తాడా... లేదా అనేది ఒకటే ఆత్రుత. అన్ని విధాల సహాయ సహకారాలు అందించడంతో పాటు నాయకుడితో సమానంగా కష్టపడ్డాం.. కానీ ఫలితాలు ఎలా ఉంటాయో అని ఒకటే టెన్షన్ పడుతుంటారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో ఓటరు దేవుడు ఏం చేస్తాడో.. ఎవరిని గట్టెక్కిస్తారు అని వేచి చూడాల్సిందే..

ఎన్నికల అధికారులకూ టెన్షనే

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల అధికారులను నియమించారు. ప్రధాన రాజకీయ పార్టీలు, అభ్యర్థులను ప్రకటిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల అభ్యర్థులను మాత్రం ప్రకటించవలసి ఉంది. ఈవీఎం పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని సవ్యంగా జరిగితే మంచిదే. ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు వినియోగించిన తర్వాత ఈవీఎంలు తిరిగి ఇచ్చేంతవరకు అధికారులకు ఒకటే ఆందోళన, ఒత్తిడికి లోనవుతారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో నిపుణ 2కె24

విశాలాంధ్ర -భీమవరం: ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఈ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22 , 23 తేదీల్లో నిపుణ- 2కె24 పేరిట జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. మురళీ కృష్ణంరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన

పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎస్‌టిఈ ఫ్యాకల్టీ అడ్వైజర్ ప్రొఫెసర్ రామ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అన్ని ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఇందులో భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు. తమ కళాశాల ఐఎస్‌టిఈ విద్యార్థి విభాగం గతంలో వరుసగా రెండు పర్యాయాలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయిలో అత్యుత్తమ రికార్డ్ సంపాదించిందన్నారు. కార్యక్ర మంలో ఐ ఎస్ టి ఈ చైర్ పర్సన్ శశాంక్ నక్క జనరల్ సెక్రటరీ పీ. శ్రీధర్ విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

విశాలాంధ్ర-నరసాపురం: స్థానిక వై.ఎన్.కళాశాల లోని ఎన్.ఎస్.ఎస్.యూనిట్, సామాజిక సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రాజుల్లంక, ఎల్.బి. చర్ల, బైనపాలెం గ్రామాలలో 'ఓటు హక్కుపై అవగాహన' కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సంద ర్భంగా ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆఫీసర్

యాకోబు, సామాజిక సేవా విభాగ సమన్వయకర్త బి. ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా రాజుల్లంక సర్పంచ్ ముదునూరి మాత్రాజును కలసి కరపత్రాన్ని అందించారు. ఓటు వేయడమనే రాజ్యాంగ హక్కును వృధా చేసుకోవద్దని' కర పత్రాలను పంచి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డా. గంధం శ్రీరామ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యం సీసాలను నూజివీడు ఎస్ఈబీ సిబ్బంది మంగళవారం స్వాధీనపరుచుకున్నట్లు నూజివీడు ఎస్ ఈ బీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు ఎస్ఈబి స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహి స్తుండగా కృష్ణారావు పాలెం వద్ద ముసునూరుకు చెందిన

అనగాని కృష్ణారావు(38) మోటర్ బైక్ పై తెలంగాణకు చెందిన మద్యం సీసాలను తరలిస్తుండగా అతని వద్ద నుండి ఓ ఏ బి 48, మెన్షన్ హౌస్ 24, కింగ్ ఫిషర్ 12, మద్యం సీసాలను స్వాధీన పరచుకున్నట్లు ఆయన తెలిపారు. అక్రమమద్యం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

పాలవాగుపై నిర్మించిన అడ్డుగోడకు యాప్రాన్ నిర్మించాలి

విశాలాంధ్ర - లింగపాలెం : పాలవాగు కాల్వకు తమ్మిలేరు కాల్వ సమీపంలో నిర్మించిన అవుట్‌లెట్ అడ్డుగోడ క్రింది భాగంలో యాప్రాన్ నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అవుట్ లెట్ అడ్డుగోడ శిథిలమవ్వటంతో ఎంపీ కోటగిరి శ్రీధర్ తన నిధుల నుంచి రూ. 60 లక్షలు మంజూరు చేసి అడ్డుగోడ నిర్మింపచేశారు. క్రింది భాగంలో రెండు వైపులా శిథిలమైంది. దీనివల్ల అడ్డు గోడకు ప్రమాదం ఉంది. పాలవాగు కాల్వ ఉధృతంగా ప్రవహిస్తే అడ్డు గోడ దెబ్బతినే ప్రమాదం ఉంది. అడ్డు గోడ క్రింది భాగంలో రెండు వైపులా కాంక్రీట్ వేసి యాప్రాన్

నిర్మించాలి. దీనికి రూ. 25 లక్షలు అవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. యాప్రాన్ నిర్మించకపోతే అడ్డు గోడకు రక్షణ లేదు. అడ్డు గోడ దెబ్బతింటే తమ్మిలేరు కాల్వ నుంచి పాలవాగు కాల్వలోకి వచ్చే నీరు తిరిగి తమ్మిలేరులోకి వెళ్ళిపోతుంది. దీనివల్ల పాలవాగు కాల్వ ఆయకట్టులో ఉన్న టీసీహెచ్ఆర్ పాలెం, కొణిజర్ల, ధర్మాజీగూడెంలోని వేలాది ఎకరాలకు సాగునీరందని ప్రమాద పరిస్థితి నెలకొని ఉంది. అవుట్‌లెట్ అడ్డుగోడ శితిలమై చాలా ఏళ్ళు ఆయకట్టు భూములకు సాగునీరు అందలేదు. ఎంపీ నిధులతో అడ్డుగోడను పునర్నిర్మించారు. యాప్రాన్ నిర్మాణం కూడా జరిపించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళా హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని

విశాలాంధ్ర-బుట్టాయిగుడెం: మహిళా హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు) ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ మహిళా

సమాఖ్య ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో బుట్టాయిగూడెం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్నవ యామిని మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించడానికి అందరం ఏకోన్ముఖులై పోరాటాలు చేయాలన్నారు. పురుషులతో సమానంగా సమాన వేతనాలు చెల్లించాలని చట్టం ఉన్నా అమలు కాకపోవడం దురదృష్టకరం అన్నారు. ఉద్యోగం, పదోన్నతులు, శిక్షణ వంటి అంశాలలో నేటికీ వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కాలరాస్తున్నదని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో మహిళా కంటక పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల మాట్లాడుతూ సమాజంలో మహిళలు కుటుంబ పోషణలో పురుషులతో సమానంగా ఆర్థికపరమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నేటి సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి మహిళలు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కరటం సీతా మహాలక్ష్మి, కౌన్సిల్ సభ్యులు షేక్ లాల్ బి, గోలిమి స్వప్న, ఎల్లి బోయిన లక్ష్మి, గుండి నాగరత్నం, సోడే చిన్నమ్మి, కొమరం గౌతమి, సోడే మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆయా, స్వీపర్లకు పెండింగ్ వేతనం చెల్లించాలి

విశాలాంధ్ర-ఏలూరు: పెండింగులో ఉన్న ఆయా, స్విపర్స్ పాత వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలల ఆయా జిల్లా కమిటీ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో గత తొమ్మిది సంవత్సరాల నుండి ఆవరణ, టాయిలెట్స్ శుభ్రపరుస్తున్నారని తెలిపారు. ఉదయం గం.8.30 నుండి సాయంత్రం గం.4.30 వరకు నాలుగు సార్లు శుభ్రం చేస్తున్నారన్నారు. కేవలం రూ.6 వేలు వేతనం మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 100 మంది విద్యార్థులు ఉండే పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండడంతో ఆయాలపై పని ఒత్తిడి భారం పడిందన్నారు. ఏదైనా అనారోగ్యం వస్తే కనీసం సెలవు కూడా ఉండటం లేదని వాపోయారు. ప్రతి 100 మంది విద్యార్థులకు ఒక ఆయాని నియమించాలని,నెలలో ఒక్కసారి మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, 108 జీఓను అనుసరించి రూ.11,500లు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో, మద్దాల దుర్గ, దేగల భవాని, చంద్ర నాగలక్ష్మి, గాలంకి కుమారి, ఎ.వెంకాయమ్మ, జి.రాధ,తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- సమగ్ర శిక్ష ఏపీసి సోమశేఖరరావు

విశాలాంధ్ర-ఏలూరు: త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి. సోమశేఖరరావు అన్నారు. మంగళవారం ఆయన పెదపాడు జెడ్పి హైస్కూల్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తొలుత ఆయన అన్ని

తరగతులలో విద్యార్థులను కలిసి మాట్లాడారు. పాల్ ల్యాబ్,సైన్స్ ల్యాబ్, లైబ్రరీ ,తాగునీటి వసతి టాయిలెట్లు, మధ్యాహ్న భోజన పథకం షెడ్లు, పాఠశాల ఆట స్థలం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పిఎంశ్రీ కి ఎంపికైన 27 పాఠశాలలకు కలిపి కెమిస్ట్రీ ల్యాబ్లు ప్లేగ్రౌండ్స్ లెవెలింగ్ నిమిత్తం సుమారు రూ 80 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు ఒక్కొక్క దానికి 5 కంప్యూటర్లు ఒక ప్రింటర్ సరఫరా చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్ష ఏయంవో రెడ్డి రామారావు ,హై స్కూల్ హెచ్ ఎం పి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

7న మాక్ డ్రిల్

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలోని కర్మాగారాలలో రసాయన విపత్తులు జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై ఈ నెల7న మాక్ డ్రిల్ జిల్లా అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం విజయవాడ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుండి జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ కమాండెంటు ఆదిత్య కుమార్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టరు ఆర్ కుర్మనాథ్ వెబ్ఎక్స్ ద్వారా రాష్ట్రంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేటు వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్, ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల కర్మాగారాల ఇన్స్పెక్టరు త్రినాథ్, జిల్లా అగ్నిమాపక అధికారి బి. శ్రీనివాస రావు, జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతిరావు, తదితర అధికారులు పాల్గొన్నారు. జాతీయ విపత్తులు నిర్వహణ సంస్థ కమాండంట్ ఆదిత్య కుమార్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టరు ఆర్. కుర్మనాథ్ మాట్లాడుతూ కర్మాగారాలలో రసాయన విపత్తులు సంభవించినప్పుడు ఏ విధంగా రక్షించుకోవాలి అనే దానిపై ఈ నెల7న మాక్ డ్రిల్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తణుకు వెంకటరాయపురం ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్, రెండవది పాలకొడేరులో ఆనంద ఎంటర్ ప్రైజెస్‌లో మాక్ డ్రిల్ ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టరు ఆర్.త్రినాథ రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా అగ్నిమాపక దళ అధికారి బి.శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.డి మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో మౌలిక వసతులకు పెద్ద పీట

విశాలాంధ్ర - కైకలూరు : మౌలిక వసతులు కల్పించటానికి గ్రామాలకు పెద్ద పీట వేస్తూ పెద్ద గ్రామంతో ప్రతి పాటు చిన్న గ్రామానికి కూడా అన్ని వసతులు కల్పించటంతో పాటు ఏదైనా అవసరాల కొరకు మండల కేంద్రానికి వెళ్లకుండా ఆ గ్రామంలోనే అందేలా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రములు,వైస్సార్

గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి గ్రామంలో గడప గడపకు వైద్యులను,అధికారులను పంపి వైద్య సేవలను అందించి వారికి ఇంకా ఏమ్మన్నా పెద్ద ఆరోగ్య సమస్యలు ఉన్నాయోనని తెలుసుకుని వారిని పెద్ద ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ ద్వారా పంపించటంతో పాటు ఆరోగ్యశ్రీ పరిధి 25లక్షల రూపాయల వరకు పెంచి సేవలు అందిస్తున్నామని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని పెంచికలమర్రలో 68.60 లక్షల జలజీవన్ మిషన్ నిధులు ద్వారా మంజూరైనా రక్షిత మంచినీటి సరఫరా పథకం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని లాంఛనంగా పనులను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు భత్రాజు శివాజీ, రాష్ట్ర నాయకులు ముంగర నరసింహారావు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్ జయమంగళ కాసులు, నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ఉపాధి అవకాశాల మెరుగుకు భవిత

విశాలాంధ్ర-ఏలూరు: సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యువత అత్యధికంగా రాష్ట్రంలో ఉన్నారని వారందరికీ నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించడం ద్వారా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరచి ఉజ్వల భవిష్యత్తు అందించే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మంచి సంక

ల్పంతో భవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం వట్లూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ ఇండస్ట్రియల్ ఆవరణలో ఆధునీకరణ భవితా కార్యక్రమం ద్వారా ఐటిఐ నిధులు రూ. 173.73 లక్షల వ్యయంతో చేపడుతున్న ఐటిఐ కాలేజీ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన, స్కిల్ డెవలప్మెంట్ నిధులు రూ. 70 లక్షలతో నిర్మించిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ప్రారంభోత్సవం చేశారు. ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నంలో భవిత కార్యక్రమానికి శంకుస్థాపన ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులతో ఆమె వీక్షించారు. అనంతరం ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ పి .రజిత అధ్యక్షతన జరిగిన సభలో విద్యార్థులను ఉద్దేశించి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించడానికి స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్లసతీష్ మాట్లాడుతూ వట్లూరు ఐటిఐ కాలేజీలో విద్యను అభ్యసించిన విద్యార్థులు దేశంలోనే అనేక చోట్ల మంచి కంపెనీలలో మంచి హోదాల్లో ఉద్యోగాలు సంపాదించారని తెలిపారు. గంటా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, నైపుణ్యశక్తిని కలిగి ఉన్నప్పుడు మంచి కంపెనీలో మంచి జీతాలతో ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భవన నారాయణ , సర్పంచి జి.రత్నకుమారి, ఎంపీపీలు పి. అరుణ కుమారి, జె. మరియమ్మ, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్, అసిస్టెంట్ ఇంజనీర్ శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం దీక్షలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారానికై ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల10న జరిగే ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని, ఈ బంద్‌కు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో కె.ఆర్.పురం ఐటిడిఏ కార్యాలయం వద్ద జరిగే ఆదివాసీ జనరక్షణ దీక్షల్లో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, అటవీ భూముల చట్ట సవరణను రద్దు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన ఏజెన్సీ ప్రాంత బంద్ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పేర్కొన్నారు. గిరిజనులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. 10వ తేదీన జరిగే బంద్ కూడా ఈ ఏజెన్సీ మండలాల్లో విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు,సంస్థలకు విజ్ఞప్తి చేశారు.

పొత్తు గెలవాలి.. వైసీపీ పోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: పొత్తు గెలవాలని.. వైసిపి పోవాలని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ స్థానిక మూడవ డివిజన్ నవాబ్ పేట కాలనీలో ఓటర్ పరిశీలన, సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ

మాట్లాడుతూ మూడు రాజధానుల ముక్కలాటతో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశాడని విమర్శించారు. అమరావతి ఐదు కోట్ల మంది ఆంధ్రుల సంపదని,దానిని నిర్వీర్యం చేసే దాక జగన్ రెడ్డి నిద్ర పోలేదన్నారు. వ్యవస్థలను సరిగా నడపలేక, పరిపాలన గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవస్థలను సరైన దారిలో పెట్టి ,గాడి తప్పిన పాలన సరిచేయాలంటే విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. లేకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మూడవ డివిజన్ మాజీ కార్పొరేటర్ జాలా సుమతి బాలాజీ, షేక్ రిజ్వానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ఐ ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర -భీమవరం: వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు వాటి నాణ్యత, మన్నిక అంశాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ ప్రసాద్ అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్

స్టాండర్డ్స్ అధ్వర్యంలో సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్ఐ సర్టిఫికేషన్ గల వస్తువులు కొనుగోలు చేయడం ద్వారానే ప్రజా ధనానికి న్యాయం జరుగుతుందన్నారు. నాసిరకం వస్తువులు కొనుగోలు చేస్తే అభ్యంతరాలు ఉంటాయని, పదే పదే ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందని ఆయన గుర్తు చేశారు. బిఐఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ జుబేద ఐఎస్ఐ సర్టిఫికేషన్ జరిగే తీరు, బిఐఎస్ ప్రమాణాలు వాటి కార్యకలాపాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ రీజనల్ డైరెక్టర్ జి.రమణ, జిల్లా పంచాయితీ శిక్షణ కేంద్రం మేనేజర్ జి.ప్రసాదరాజు, డివిజన్ పంచాయితీ అధికారులు బాలాజీ వెంకటరమణ, సత్యనారాయణ, జిల్లాలోని సర్పంచ్ లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్కడ పని జరగాలంటే కత్తి మీద సామే!

- కొత్త కార్యదర్శి వచ్చినా అవే బాధలు
- కొత్త పన్నుల కోసం కాళ్ళరిగిపోవాలి
- మంచినీటి కుళాయి కోసం కాసులు కురిపించాలి

విశాలాంధ్ర-వీరవాసరం: అక్కడ పని జరగాలంటే నెలల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సిందే. నియోజకవర్గంలోనే కాకుండా, మండలంలో ఏ పంచాయతీలో నైనా ప్రజలు ఏదైనా పని నిమిత్తం ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు వెళితే ఆరోజు లేక మరుసటి రోజు ఆ పని పూర్తవుతుంది. కానీ నియోజకవర్గానికి కూతవేటు దూరంలో ఉన్న మండల కేంద్రం వీరవాసరం మేజర్ పంచాయతీలో పని జరగాలంటే మాత్రం ఆ గ్రామ ప్రజలకు అందని ద్రాక్షగానే మిగులుతుంది. వడ్డించేవాడు మనవాడు అయితే చివరి బంతిలో ఉన్నా అన్ని రకాలు అందుతాయి అనే సామెతల పంచాయతీ బోర్డు సభ్యుల, అధికార పార్టీ నాయకుల, పార్టీ కార్యకర్తల అనుయాయులకు మాత్రం ఎటువంటి అవాంతరాలు, నిబంధనలు ఉండవు. వెంటనే క్షణాల్లో పని జరిగిపోతుంది. ఎక్కడైనా అయినవారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో అని అంటారు కాని వీరవాసరం గ్రామ పంచాయతీ తీరే వేరు... ఇక్కడ వారికి సంబంధించిన వారికే అన్ని సౌకర్యాలు. మిగిలిన వారికి కాళ్ళు పట్టుకున్నా, కాళ్ళరిగేలా తిరిగినా ఏమి జరగదు. అదేమని అడిగితే కార్యదర్శి లేడని లేకపోతే బోర్డు మీటింగ్ జరగలేదని సమాధానం. అభివృద్ధి విషయానికి వస్తే పంచాయతీ పరిధిలో కొన్ని ఏరియాల్లోనే అభివృద్ధి. అసలు గ్రామంలో ఏం జరుగుతుంది ? గత రెండు ఏళ్ళలో ఎంత మంది పంచాయతీ కార్యదర్శిలు వచ్చారు? ఇంత మేజర్ పంచాయతీకి రెగ్యూలర్ కార్యదర్శిని ఎందుకు వేయడం లేదు? ఇలా సామాన్య ఓటరు మదిలో ఎన్నో ప్రశ్నలు. పరిష్కారమే లేదిక్కడ ఇంక సమాధానాలు ఎవరు చెబుతారు. కొంతమంది ఇంటిని నిర్మించుకుని విద్యుత్ సదుపాయం కోసం, కొంతమంది నో అబ్జెక్షన్ సర్టిఫికెట్టు కోసం, కొంతమంది ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం, కొంతమంది మంచినీటి కుళాయి కోసం ఇలా ఒక్కొక్కరూ ఒక్కో పనికోసం గ్రామంలో అనేక మంది దరఖాస్తుతో కార్యదర్శిల చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పటికప్పుడు పంచాయితీ కార్యదర్శి మారిపోవడం వలన దరఖాస్తు ఎవరికిచ్చారు, ఎక్కడిచ్చారు అని తిరిగి ప్రశ్నిస్తున్నారు. అక్కడ ఉన్న సిబ్బందికి ఒకరికి ఒకరు పొంతన ఉండదు. ఎవరికి వారే జిల్లా కలెక్టర్ గా ఊహించుకుంటారు. ఇళ్ళు కట్టుకుని పన్ను వేయమని అనేక మంది తిరుగుతున్నా పంచాయతీకి ఆదాయం వచ్చే మార్గాలు చూడకుండా వీరి ఆదాయ మార్గాలు చూసుకోవడం వలనే జాప్యం జరుగుతుందని ప్రజలు బాధపడుతున్నారు. పన్ను వుంటే కుళాయి కనక్షన్ వస్తుంది. పన్ను వేయాలంటే అప్రూవల్ కావాలి, అప్రూవల్ కావాలంటే సమావేశం జరగాలి, సమావేశం జరగాలి అంటే సమయం పడుతుంది అని ఇలా ఒక దానికి ఒకటి ముడి పెట్టి పబ్బం గడుపుతున్నారు. కొంత మంది స్పందనలో ఫిర్యాదులు చేస్తున్నా మాకు వర్తించవు అన్నట్లుగా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారు. వచ్చిన ప్రతీ కార్యదర్శి ఇక్కడ పని చేయలేం అని అంటున్నారు, కాని అసలు ఏమి పని చేస్తున్నారని ప్రజలు గొణుక్కుంటున్నారు. భవన నిర్మాణానికి పంచాయతీ బోర్డు సమావేశాల్లో ఆమోదించవలసిన అవసరం లేదని ఈయూడీఏ స్పష్టం చేసింది. అయినప్పటికీ వీరవాసరం పంచాయతీ లో నిబంధనలు అమలు కావటం లేదు. గృహ నిర్మాణ దారులు ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేస్తే అనుమతి లభించటం లేదు. దీనికి కారణం పంచాయతీకి శాశ్వత ప్రాతిపదికన గ్రామ కార్యదర్శి లేకపోవటమేనని చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది అయితే తాత్కాలిక కార్యదర్శులు చార్జ్ అప్పగించలేదని, రికార్డులేదని బాహాటంగా చెబుతున్నారు. 2022 ఏప్రిల్, జూన్ నెలల్లో అప్పటి కార్యదర్శి డి.శ్రీనివాసరాజు సస్పెన్షన్ కు గురయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అరుగురు కార్యదర్శులు ఇక్కడ విధులు నిర్వర్తించలేమంటూ వెళ్లిపోయారు. ప్రస్తుతం ఏడో కార్యదర్శిగా ఈవోపీఆర్డీ విజయసారథిని నియమించారు. అయినప్పటికీ ప్రజల అవసరాలకు మోక్షం కలగటం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికారులకు ఫిర్యాదు చేసుకోండి అని దురుసుగా సమాధానం ఇస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సార్లు మారినా గ్రామం తలరాత మారడం లేదని ప్రజలు తలపట్టుకుంటున్నారు.

పేదలకు విద్య, వైద్యం అందించిన ఘనత వైసీపీదే

విశాలాంధ్ర - కైకలూరు : ప్రజలు వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వానికే పట్టం కడుతున్నారు అని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు.పట్టణం లోని ఎన్జీఓ స్ కాలవగట్టు పరిధిలోని15,16వ వార్డ్ లలో 5వ రోజుగా జరిగిన గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమానికి నాయకులతో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలకు విద్య ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. పతి పేదవానికి సురక్ష కార్యక్ర మాలు ఏర్పాటు చేసి ఇంటి వద్దకే ధ్రువపత్రములను,వైద్యమును అందించిన ఘనత తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్,సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి,రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ హమీద్,మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ రఫీ,వైసీపీ సీనియర్ నాయకులు కన్నా రమేష్,సర్పంచ్ గండికోట ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

7న మహిళా సదస్సు

విశాలాంధ్ర-ఏలూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని 7వ తేదీ సదస్సు, కళా నీరాజనం, 55 మంది మహిళలకు అభినందన సత్కారాలు సభ ను జయప్రదం చేయాలని ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం పవర్ పేటలోని అన్నే భవనంలో కార్యక్రమం ప్రచార ఫ్లెక్సీ లను కమిటీ పెద్దలు ఆవిష్కరించారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. అడుసుమిల్లి నిర్మల, గుడిపాటి నరసింహారావు, పి.ఆంజనేయులు, జి. శారద, ఎ. మోహిని, పి. కనకదుర్గ, ఎం.గంగాభవాని, కే శ్రావణి కుమారి, పి. సూర్య ప్రకాష్ రావు, కే. శ్రీనివాసరావు, టీ. తులసి, టి.నాగయ్య, ఎం. సాయి సిద్దార్ధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న వైఎంహెచ్ఏ హాలు నందు మహిళా చైతన్య సదస్సు ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ వి ఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఏడో తేదీ నిర్వహించే సదస్సుకు ముఖ్యఅతిథిగా విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కమిటీ నిర్వాహకురాలు కే స్వరూప రాణి ప్రధాన వక్తగా హాజరవుతున్నారని అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళల అభివృద్ధి అనే అంశంపై నాలుగు నిమిషాల ఉపన్యాసం పోటీలు కోసం ఏర్పాటుచేసామన్నారు. ఈ కార్యక్రమాల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బీసీల అభ్యున్నతికి టీడీపీ కృషి

విశాలాంధ్ర - కలిదిండి: బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ విశేష కృషి చెస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. మంగళ వారం మంగళగిరిలో జయహో బీసీ బహిరంగ సభకు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలిదిండి మండలం నుండి తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. జయహో బీసీ బహిరంగ సభకు కార్ల ర్యాలీని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పిటిసి సభ్యురాలు నున్న రమాదేవి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా. చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారని, ఇప్పటికే బీసీ రక్షణ చట్టం గత మహానాడులో ప్రకటించి ప్రజల్లోకి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు.గతంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి. తారక రామారావు స్థానిక సంస్థల్లో 24 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తే, తర్వాత వచ్చిన చంద్రబాబు నాయుడు 10 శాతం పెంచి దానిని 34 శాతం చేశారని అన్నారు. . ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర రజిక సాధికార కమిటీ సభ్యులు లంకా రత్నారావు, నాయకులు వాకాని కోటేశ్వరరావు, సంఘాని గంగాధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

జయహో బిసి సభకు తరలిన తమ్ముళ్లు

విశాలాంధ్ర -భీమవరం: గుంటూరులో జరుగుతున్న జయహో బీసీ రాష్ట్ర మహాసభకు భీమవరం నుండి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్ళు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్లోని అన్ని నియోజకవర్గాల నుండి టిడిపి జనసేన నాయకులు వేలాదిగా జయహో బిసి రాష్ట్ర మహాసభకు తరలి వెళుతున్నామని జయహో బీసీ మహాసభలో చంద్రబాబు ప్రవేశపెడుతున్న బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం గురించి బీసీలంతా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి నౌషాద్, జిల్లా కార్య నిర్వాహకార్యదర్శి మైలాభత్తుల ఐజాక్ బాబు, కృష్ణ బలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి గూడారి సుబ్బారావు, యాదవ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు కోంద్రు శ్రీనివాస్, వాణిజ్య విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర -భీమవరం: సాధికారత దిశగా మహిళలు పయనించి ఆకాశంలో సగం దాటివెళ్లాలని డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజన్ కుమార్ అన్నారు.మహిళ దినోత్సవ వారోత్సవాల వేడుకల్లో భాగంగా డిఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థినులకు రంగ వల్లుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల చైతన్యంతోనే సమాజ ప్రగతి ఆధారపడిందని, అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుండాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వర్మ, లైబ్రేరియన్ కె.శిరీష మాట్లాడుతూ 125 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, డాక్టర్ గాయత్రీ, ప్రియాంక, సబిత విద్యార్థులు పాల్గొన్నారు.

మెప్మా అధ్వర్యంలో: మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మెప్మా అధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు గొప్ప స్థానం ఉందని సహనానికి ప్రతిరూపం మహిళలన్నారు. సిఒ జయకృష్ణ, పిఒ నానిబాబు, పెద్దింట్లమ్మ, సంతోషమ్మ, మహిళ సంఘాల సభ్యులు పిఎస్ఎం, డిఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల, సర్ సీవి రామన్ స్కూల్ విద్యార్థులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుందుర్రులో : భీమవరం రూరల్ తుందుర్రు గ్రామ సచివాలయంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ సరళ మాట్లాడుతూ పురుషులతో సమానంగా హక్కులు సాధించుకోవాలని, సాధికారత సాధించాలన్నారు. తోటి మహిళల్లో చైతన్యం తేవడానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, కనకదుర్గ, వజ్రకుమారి, అంగన్వాడీ, ఆశ, సచివాలయం సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైసీపీకే ఉంది

విశాలాంధ్ర-కాళ్ళ : సచివాలయం, వాలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి గాంధీ కలలు కన్నా గ్రామస్వరాజ్యాన్ని గ్రామంలోకి తీసుకొచ్చిన వైసిపి కే ఓటు అడిగే హక్కు ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్ భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పి వి ఎల్ నరసింహ రాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజుతో కలిసి ప్రజల సేవార్థమే నిర్మించిన భవనాలను ప్రారంభించారు పి వి ఎల్ నరసింహ రాజు మాట్లాడుతూ గణేన్నా రాంబాబు , సుంకర భోగేశ్వర రావు చరవతో ఈ సచివాలయాలు నిర్మించడం తో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలిగిందన్నారు. కాళ్ల మండలం కాళ్ల గ్రామంలో 43.60 లక్షలు రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, సిసలి గ్రామంలో, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించగా, పెద్ద అమిరం గ్రామంలో హెల్త్ సెంటర్ సచివాలయం లను రాష్ట్ర ప్రభుత్వ విప్, ముదునూరి ప్రసాద్ రాజు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు . భీమవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మోటుపల్లి గంగాధర్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెట్టికి ఘన స్వాగతం

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు, ఏఐసిసి సభ్యుడు జెట్టి గురునాథరావును వైసీపీ కండువా కప్పి ముఖ్యమంత్రి జగన్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జంగారెడ్డి గూడెం విచ్చేసిన జెట్టి గురునాధరావు,మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు కు వైసీపీ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వైసీపి చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జ్ కంభం విజయరాజు దుశాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గురునాథ రావు, కంభం విజయ రాజు, ముప్పిడి శ్రీనివాసరావు ప్రచార రథంపై భారీ ర్యాలీగా జంగారెడ్డిగూడెం చేరుకున్నారు. రావికంపాడు, దేవులపల్లి, పుట్లగట్ల గూడెం, గురవాయి గూడెం మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా జనం నీరాజనాలు పలికారు. పూల వర్షం కురిపించారు. వైసీపీ శ్రేణుల్లో కొత్త జోష్ కనబడింది.

రోడ్డు పనులకు ఎంపీ శంకుస్థాపన

విశాలాంధ్ర - లింగపాలెం : యడవల్లి నుంచి ఎర్రావారిగూడెం వెళ్ళే మార్గం పూర్తిగా దెబ్బతినటంతో దీనిని పునర్నిర్మించేందుకు ఎంపీ కోటగిరి శ్రీధర్ తన నిధుల నుంచి రూ. 60 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులకు ఎంపీ మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్మన్ జగ్గవరపు జానకీరెడ్డి, నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి కంభం విజయరాజు, రాష్ట్ర కార్మిక సంక్షేమశాఖ వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, లింగపాలెం మండల వైసీపీ అధ్యక్షులు కొఠారు మోహన్, చింతలపూడి మండల జడ్పీటిసి నీరజ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జనకు తరలి వెళ్లిన నాయకులు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి: తెదేపాతోనే బీసీలకు మేలు జరుగుతుందని రానున్న ఎన్నికల్లో బీసీలు అంత ఐక్యంగా ఉండి తెదేపాని గెలిపించాలని టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి అన్నారు. మంగళవారం జరిగే మంగళగిరిలో టిడిపి ఆధ్వర్యంలో జయహో బీసీ గర్జన కు జీలుగుమిల్లి నుండి నాయకులు తరలి వెళ్లారు. పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీను మాట్లాడుతూ జయహో బిసి గర్జన భారీ బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారన్నారు. బీసీలు గర్జన చూపించే విధంగా బహిరంగ సభ జరుగుతుందని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీ వెంట నడుస్తూ పార్టీకి అండగా నిలుస్తున్నారన్నారు .ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు తోట బాలు, ఉప సర్పంచ్ పాలగాని నాగరాజు, నాయకులు వనమా వెంకటేశ్వరరావు, మామిళ్ళ వెంకట్రావు, మరీదు పండు, నల్లాపు దుర్గారావు,పేరు బోయిన దుర్గారావు, పేరు బోయిన దాము, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు .

బీసీ కార్యక్రమం విజయవంతం

విశాలాంధ్ర -తణుకు: జయహో బీసీ కార్యక్రమం విజయవంతమైందని తణుకు మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడించారు. సకల జనుల చైతన్యం కోసం నిర్వహిస్తున్న రేపటి కోసం పాదయాత్ర తణుకు రూరల్ మండలంలో జరిగింది. గ్రామంలోని అంబేద్కర్ ఎన్టీఆర్ అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన విధులతో పాటు బీసీ, ఎస్సీ కాలనీలలో ఆరిమిల్లి కాలినడకన పర్యటించి అక్కడ వారిని పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పైడిపర్రు,మండపాక గ్రామంలోకి పాదయాత్ర ప్రవేశించింది. మంగళవారం పల్లె నిద్రలో భాగంగా మండపాక గ్రామంలో ఆరిమిల్లి బస చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, తణుకు మండల పార్టీ అధ్యక్షులు పితాని మోహన్, తణుకు పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జన హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన జగన్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి జగన్ఇచ్చిన మాట తప్పకుండా నవరత్నాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు కట్టించి పేదల హృదయాలలో చిర స్థాయిగా నిలిచారని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక 1,2 సచివాలయాల పరిధిలో జగనన్న ఇళ్ళ రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కేశవపల్లి వారి వీధిలోని 1 వ సచివాలయం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా 1,2 సచివాలయాల లబ్దిదారులైన 230 మందికి రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జెట్టి గురునాధరావు, మేడవరపు విద్యా సాగర్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు,బత్తిన చిన్నా, పట్టణ వైసీపీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, కౌన్సిలర్ లు పి.పి.ఎన్. చంద్రరావు, పెసరగంటి గంగ, అయినాల రమణమూర్తి, నేకూరి కృష్ణ కిషోర్, ఉగ్గం దుర్గా ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ చలమాల శ్రీనివాస్, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ కె. వెంకట రమణ చిప్పాడ వెంకన్న ,ఎస్.కే. అమీర్ ,నేట్రు గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ

విశాలాంధ్ర - ముసునూరు: తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు బి.సిలకు ఆండగా వుంటుందని రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. మంగళ వారం ముసునూరు మండలంలోని 16 గ్రామాల నుండి నాల్గు బస్సుల్లో సుమారు 500మంది బిసి సోదరులు,సోదరీ మణులు మంగళగిరి లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా వున్న ఖాళీ స్థలంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్యక్షతన నిర్వహిస్తున్న బిసి సదస్సుకు హాజరైనట్టు తెలిపారు. రాష్ట్ర బిసి నాయకులు మానురాజ్ సురేష్ ,గారపాటి నరసింహారరావు ,తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక అభివృద్ధికి సీఎం కృషి

విశాలాంధ్ర-భీమడోలు: పేదలకు ఇంటి స్థలం ఇవ్వటమే కాకుండా ఆస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్ కే దక్కిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం భీమడోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఇంటి స్థలం హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొని లబ్ధిదారులు హక్కుపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అన్ని వ్యవస్థల్లో నూతన సంస్కరణలతో పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగా, ఎంపీపీ కనుమాల రామయ్య, పార్టీ మండల అధ్యక్షులు రావిపాటి సత్యశ్రీనివాస్, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.



వైసీపీకి రెండంకెల సీట్లు వచ్చే పరిస్థితి లేదు

విశాలాంధ్ర-పోడూరు: రానున్న ఎన్నికలలో వైసిపి కనీవిని ఎరుగని ఓటమి చవిచూస్తుందని, రెండు అంకెల సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని ఈ విషయాన్ని ఒకప్పటి వారి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ చెబుతున్నారని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని పెనుమదం లో మంగళవారం టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. తూర్పు పేట మెయిన్ రోడ్ అనుకూరి వారి వీధి మార్కెట్ సెంటర్ అమ్మవారి గుడి వీధి ప్రాంతాలలో ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం హామీలను వివరించి వచ్చే ఎన్నికలలో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మండల టీడీపీ నాయకులు పెన్మత్స రామభద్రరాజు, కడలి ఆంజనేయులు, దేవరపు దొరబాబు, తానేటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ను జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ నాబార్డు భారత దేశంలోని అన్ని జిల్లాలకు ప్రతి ఏటా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌లను ప్రచురిస్తోందన్నారు. తద్వారా వాస్తవిక, అమలు చేయగల క్రెడిట్ అవసరాలను రూపొందించడంలో బ్యాంకర్లకు సహాయంగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఇది ఫైనాన్స్ స్థాయి, యూనిట్ ఖర్చులు, గ్రౌండ్ లెవల్ క్రెడిట్ ఫ్లో యొక్క సరళి, మారుతున్న పద్ధతులను పరిగణనలోకి తీసుకొని తయారు చేయబడుతుందన్నారు. ఆర్థిక సంవత్సరం 2024-25 లో ప్రాధాన్యతా రంగం కోసం మొత్తం ప్రొజెక్షన్ రూ.1820405.04 లక్షలు, మొత్తం వ్యవసాయ అంచనా రూ.1148246.56 లక్షలతో తయారు చేయబడింది, ఇది మొత్తం ప్రొజెక్షన్‌లో 63.07%. మొత్తం వ్యవసాయంలో, పంట రుణం రూ.532648.37 లక్షలు, వ్యవసాయ టర్మ్ లోన్ రూ.434730.47 లక్షలు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు రూ.50034.28 లక్షలు మరియు అనుబంధ కార్యకలాపాలు రూ.130833.45 లక్షలు. రూ.423468.50 లక్షలు %మీవీఙు% లోన్ అంచనా వేయబడింది. ఎగుమతి క్రెడిట్ రూ.21200.00 లక్షలు, విద్య రూ.47 8478.00 లక్షలు, హౌసింగు రూ.81990.00 లక్షలు, బ్యాంకు క్రెడిట్ రూ.4378.50 లక్షలు, పునరుత్పాదక ఇంధనం, పునరుత్పాదక ఇంధనం, రూ.1618.48 లక్షలు, ఇన్ఫార్మల్ క్రెడిట్ డెలివరీ (ఎస్‌హెచ్‌జీజీ.) రూ.131025.00 లక్షలుగా చేర్చబడ్డాయి.పశ్చిమ గోదావరి జిల్లా కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను నాబార్డు డిడియం టి.అనిల్ కాంత్ రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్. వెంకటేశ్వరావు, నాబార్డు టి.అనిల్ కాంత్, లీడ్ బ్యాంకు మేనేజరు ఏ. నాగేంద్ర ప్రసాదు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కొట్టి. కుటుంబరావు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జన సభకు చాట్రాయి యాదవులకు ఆహ్వానం లేదు

విశాలాంధ్ర-చాట్రాయి: కొందరికే సారథి సొంతమా? బీసీలు అంటే ఎవరు? చాట్రాయి మండలంలో బీసీ కులాలు ఎన్ని వున్నాయి. చాట్రాయి గ్రామ యాదవులను మంగళగిరి సభకు ఎందుకు పిలవలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో 600కు పైగా యాదవుల ఓటింగ్ కలిగి ఉన్నారని గ్రామంలో పార్టీకి అండదండగా ఉన్నది యాదవులేనని ప్రతికూల పరిస్థితులలో కూడా పంచాయతీ ఎన్నికల్లో యాదవులు ప్రాబల్యం కలిగిన వార్డులో మాత్రమే గెలవడం జరిగిందని ఓసి నివాస ప్రాంతాల్లో కూడా వార్డు మెంబర్ కు ఓడి పోతుందని తెలిసినా పోటీ చేయడానికి యాదవ సామాజిక తరగతికి చెందిన మహిళలను నిలబెట్టడం జరిగిందని వారు గుర్తు చేస్తున్నారు. బీసీ సెల్ మండల మాజీ అధ్యక్షులు కంపసాటి చెన్నారావు మాట్లాడుతూ చాట్రాయి మండలంలో బీసీలు అంటే కేవలం ఒకే ఒక కులం కాదని 11 కులాలకు పైగా ఉన్నాయని తాను మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గ్రామంలో అత్యధిక ప్రాబల్యం కలిగిన సామాజిక తరగతి యాదవ సామాజిక తరగతి అన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా యాదవులు ఉన్నారనే పేరుతో పార్టీ అధినేత చంద్రబాబు అభ్యర్థిని మార్చినా మూడోసారి కూడా యాదవులకి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినప్పటికీ పార్టీ మీటింగులకు వెళ్లడానికి మాత్రం స్థానిక పెద్ద నాయకులు యాదవులను గుర్తించకపోవడం చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా వుందన్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి అనుగ్రహం యాదవులకు రావడం లేదన్నారు. గ్రామ పార్టీ కార్యదర్శి కంపసాటి శంకర్రావు తదితరులు మాట్లాడారు.

టిడిపి విజయానికి కృషి చేయాలి

విశాలాంధ్ర- మండవల్లి: రాబోయే ఎన్నికలలో టిడిపి విజయానికి కృషి చేయాలని మాజీ ఎంపీ మాగంటి బాబు పిలుపునిచ్చారు. మంగళవారం లింగాల గ్రామంలో స్థానిక నాయకులు కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాగంటి బాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో చంద్రబాబు తలపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.కలిసికట్టుగా కార్యకర్తలు అందరూ ఒక తాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో విజయం కోసం అలుపెరగని సైనికుడి లాగా కష్టపడాలని అన్నారు. భైరవపట్నం గ్రామ తెలుగుదేశం నాయకులు బొల్లింపల్లి కృష్ణ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన సందర్భంగా వారిని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మండవల్లి మండల అధ్యక్షులు నారగాని వెంకట నాగేశ్వరరావు, పళ్లెం ఏడుకొండలు, జోసఫ్ తంబి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిసిలకు అన్ని విధాలా అండగా నిలిచిన తెదేపా

చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర- పెదపాడు: బిసిలకు సామాజికపరంగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా అండగా ఉండటంతో పాటు, రాజ్యాధికారంలో సైతం సముచిత ప్రాధాన్యత కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. గుంటూరు జిల్లా లోని నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జరుగుతున్న తెలుగుదేశం పార్టీ జయహో బీసీ కార్యక్రమానికి చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గంకి చెందిన బీసీ నాయకులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. పెదపాడు మండలం హనుమాన్ జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద జయహో బిసి కార్యక్రమంలో పాల్గొనటానికి సుమారు 200 కార్లలో తరలి వెళ్తున్న దెందులూరు నియోజక వర్గ బిసి నాయకుల భారీ ర్యాలీనీ చింతమనేని ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలోని బీసీలకు తగిన గుర్తింపు లభించిందని, బీసీలకు ఆర్థికంగా అభివృద్ధి చెందేలాగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చంద్రబాబు నాయుడు హయాంలో ప్రవేశపెట్టడం జరిగిందని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీల అధ్యక్షులు లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, బొప్పన సుధా, మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), సీనియర్ నాయకులు , పలువురు బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న జగనన్న ప్రభుత్వం

విశాలాంధ్ర-పాలకోడేరు : అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం లో వైకాపా ముందుకు దూసుకు పోతోందని ప్రభుత్వ విఫ్ ముదునూరి ప్రసాదరాజు, అన్నారు. మంగళవారం రూ.2 కోట్ల పదిలక్షల నిధులతో పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, వేంద్ర, కొండేపూడి, కన్నాడ అగ్రహారం గ్రామాలలో నిర్మించిన సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ప్రసాదరాజు,డిసిసిబి చైర్మన్ పివీఎల్ నరసింహరాజు, ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్ సి,బి సి లను ఉద్దేశ్య పూర్వకంగా విస్మరించాయన్నారు. వైసిపికి ఓటేసి మరలా జగనన్న ను ముఖ్యమంత్రి చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటిరాజు, ఉండి ఏఎంసీ చైర్మన్ బొక్క వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ చేకూరి నరేంద్ర రాజు, పార్టీ మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వండి

విశాలాంధ్ర-పోడూరు : పీసీసీ అధ్యక్షురాలు వై యస్ షర్మిల నేతృత్వంలో రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటున్నదని రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని పిసిసి సభ్యులు షేక్ మహబూబ్ జానీ కోరారు. పాలకొల్లు నియోజకవర్గం పరిధిలో పోడూరు మండలం వేడంగిలో బుధవారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామంలో ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఆయన గుర్తు చేశారు. ప్రతి పేద కుటుంబానికి 5000 రూపాయలు జరుగుతుందని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టారని ఆయన తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాను ప్రకాష్ నాయుడు పాలకొల్లు మండల అధ్యక్షులు రొక్కాల బెన్నీపాల్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.